క్లుప్తంగా

కృష్ణా నదిలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవు

మైనింగ్ ఆర్ఐ రాజేంద్రప్రసాద్



కొల్లూరు : కృష్ణా నదిలో ఇసుక తవ్వకాలు చేపట్టడానికి ఎటువంటి అనుమతులు లేవని మైనింగ్ ఆర్ఐ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. మండలంలోని గాజుల్లంక కృష్ణా నదిలో ఉచిత ఇసుక క్వారీలో గడువు ముగిసినా నిబంధనలను అతిక్రమించి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు సమాచారం అందడంతో పరిశీలనకు వచ్చినట్లు ఆయన తెలిపారు. నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా మైనింగ్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 15తో గడువు ముగిసిన నేపథ్యంలో ఎటువంటి ఇసుక తవ్వకాలు చేపట్టవద్దని గతంలో ఉచిత ఇసుక క్వారీ పొందిన ఏజెన్సీ వ్యక్తులకు తెలియజేశామన్నారు. నదిలో, పట్టా భూములలో గడువు ముగిసినప్పటికీ చేపడుతున్న తవ్వకాలపై ఏజెన్సీ వ్యక్తులను ప్రశ్నించడం జరిగిందన్నారు. ఇసుక నింపుకొని లారీలు వెళుతుండటాన్ని గమనించి వాటిని పరిశీలించగా వారి వద్ద ఎటువంటి బిల్లులు లేకపోవడంతో 3 లారీలను చెరుకుపల్లి పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు. అయితే మైనింగ్ శాఖాధికారుల తూతూ మంత్ర పరిశీలనపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

30న స్కంధ షష్టి మహోత్సవం

బాపట్ల: శ్రీలలితా త్రిపురసుందరీ పీఠం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన స్కంధ షష్టి మహోత్సవం బాపట్లలోని టౌన్ హాలులో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు పేర్కొన్నారు. పంచాంగకర్త పండిత ముత్తేవి శ్రీనివాస శశికాంత్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవం జరుగుతుందని తెలిపారు. ఉదయం 10.30 గంటలకు శ్రీలక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్య మంత్రయుక్త సర్వసూక్త సహిత హోమార్చన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. తొలుత సుబ్రహ్మణ్య స్వామి కావడి సేవ మహోత్సవం ఉంటుందని తెలిపారు. ఉత్సవంలో పాల్గొనే వారు ఈ నెల 25వ తేదీలోపు పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాలకు నెమలికంటి హనుమంతరావు 9701489906, రొంపిచర్ల కేశవాచార్యులు 7386444371ను సంప్రదించాల్సిందిగా కోరారు.

ప్రత్తిపాడు ఈవోపీఆర్డీగా ఆదం షఫీ



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండల ఈవోపీఆర్డీగా షేక్ ఆదం షఫీ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈవోఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్న జి.రవికుమార్ మే నెలలో ఉద్యోగోన్నతిపై ఎంపీడీవోగా క్రోసూరు మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా దొనకొండ మండలం ఈవోపీఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్న షఫీని ప్రత్తిపాడు మండలానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఈవోపీఆర్డీగా మండలంలో బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో కె.శివపార్వతి సోమవారం తెలిపారు.

సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన

తెనాలిఅర్బన్: జీవో నెంబర్ 5ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అన్ని సచివాలయాల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ బదిలీల కోసం ఇచ్చిన జీవో నెంబర్ 5 ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఉందన్నారు. దానిని ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం పోరాడదాం

తెనాలి: జనాభా దామాషా మేరకు చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం ఓబీసీలమంతా సమైక్యంగా పోరాడాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సమగ్ర కుల గణన షెడ్యూల్ గెజిట్ ప్రచురణపై హర్షం వ్యక్తం చేస్తూనే, జనాభా దామాషా మేరకు ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలనే నినాదంతో ఇకపై దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధపడుతున్నామని శంకరరావు తెలిపారు. కేంద్రంలో ప్రత్యేకంగా ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పరిచి, జనాభా దామాషా మేరకు ఓబీసీ సబ్ ప్లాన్ రూపొందించి, ఆ మేరకు బడ్జెట్లో నిధులు కేటాయించి, సక్రమంగా పథకాలను అమలు పర్చాలని విజ్ఞప్తి చేశారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

కొల్లిపర: గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చి కనిపించకుండా పోయిన యువతి గురించి సోమవారం కొల్లిపర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. కేఎల్ యూలో డిగ్రీ చదువుతున్న 20 సంవత్సరాల యువతి బంధువుల ఇంటికి వచ్చి మూడు రోజులు తరువాత ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోవటంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యథేచ్ఛగా తవ్వకాలు.. పట్టని అధికారులు

- మట్టిని కొల్లగొడుతున్న పచ్చమూకలు
- క్రాప చెరువులో నిరాఘాటంగా తవ్వుతున్న వైనం
- పంచాయతీ తీర్మానాలతో సరి
- ప్రభుత్వ శాఖల అనుమతులు నిల్
- మట్టిని అమ్ముకొని జేబులు నింపుకుంటున్న నాయకులు



క్రాప సచివాలయం ఎదురుగా ఉన్న ఊర చెరువులో యంత్రాలతో చేపట్టిన మట్టి తవ్వకాలు

కొల్లూరు : కూటమి ప్రభుత్వ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని సాగిస్తున్న అక్రమాలకు అంతం లేకుండా పోతుంది. కూటమి అధికారంలోకి వచ్చింది మొదలు పచ్చ పార్టీకి చెందిన నాయకులు నిబంధనలను విస్మరించి సాగిస్తున్న అక్రమ ఇసుక, మట్టి తవ్వకాలకు అడ్డుఅదుపు లేకండా పోతుంది. సహజ వనరులను కొల్లగొడుతూ జేబులు నింపుకుంటున్న అధికార పచ్చమూకలు మట్టి కొల్లగొట్టే పనిలో నిమగ్నమయి చెరువులను ఓటి కుండలుగా మార్చడానికి నడుం కట్టారు.

వెల్లువెత్తుతున్న విమర్శలు

చెరువుల్లో మట్టి కొల్లగొట్టేందుకు గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన నీరు–చెట్టు పథకం ప్రస్తుతం లేకపోయినప్పటికీ.. టీడీపీ వర్గీయులు అదే పంథాను కొనసాగిస్తూ అక్రమ మట్టి తవ్వకాలకు తెగబడుతున్నారు. మండలంలోని క్రాపలో ప్రభుత్వ శాఖల నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండా నిబంధనలను విస్మరించి మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారు. క్రాప నడిబొడ్డులో సచివాలయం ఎదురుగా నిరాఘాటంగా యంత్రాలను వినియోగించి ప్రభుత్వ శాఖల అనుమతులు లేకుండా ఊర చెరువులో మట్టి తవ్వకాలు చేపడుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● చెరువులో పూడికతీత పనులు ఉపాధి హామీ కూలీలకు కల్పించి పూడిక పనులు చేపట్టే వెసులుబాటున్నా, యంత్రాలతో టీడీపీకి చెందిన వ్యక్తులు మట్టి తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లలో తరలించి సొమ్ము చేసుకోవడంపై స్థానికంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుంది. నిబంధనల మేరకు రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ శాఖల అనుమతులతో పూడిక తీయాల్సిన పరిమాణాలను నిర్దేశించిన మేరకే మట్టి తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. అయితే పంచాయతీ తీర్మానాన్ని ఆసరాగా చేసుకొని టీడీపీకి చెందిన వ్యక్తులు ప్రొక్లైనర్లను వినియోగించి సరైన కొలతలు లేకుండా చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టడంతో చెరువులో భవిష్యత్తులో నీటి నిల్వలు నిలవకుండా పోతాయన్న ఆందోళన వ్యక్తమవుతుంది. చెరువులో సుమారు మూడు అడుగుల లోతుతో మట్టిని కొల్లగొట్టి ట్రాక్టర్ ట్రక్కు మట్టి రూ.600 చొప్పున టీడీపీ నాయకులు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అనుమతులపై పరిశీలిస్తాం

చెరువులో పూడికతీత పనులలో భాగంగా జరుగుతున్న మట్టి తవ్వకాలకు అనుమతులు మంజూరయ్యాయా లేదా అన్న అంశంపై పరిశీలిస్తాం. పంచాయతీ తీర్మానం అనంతరం మైనింగ్ శాఖకు అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు వెల్లడయ్యింది. అనుమతులు మంజూరు అవని పక్షంలో చర్యలు చేపడతాం.

–బి.వెంకటేశ్వర్లు(తహసీల్దార్), కె.నరసింహారావు(ఎంపీడీవో), కొల్లూరు

ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య



ఇరాన్‌పై అమెరికా దాడిని నిరసిస్తున్న సీపీఎం నాయకులు

బాపట్ల: ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని ఉప్పరపాలెంలో ఇరాన్‌పై అమెరికా దాడులను ఖండిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గల్ఫ్ దేశాల్లో చమురు నిక్షేపాలపై పెత్తనం కొనసాగించాలని దుర్బుద్ధితో ఇరాన్‌లో అణు ఆయుధాలు ఉన్నాయని వంక చెబుతూ ఆ దేశంపై దాడికి దిగడం హేయమైన చర్య అన్నారు. గతంలో సద్దాం హుస్సేన్‌పై, సిరియా, గాజాపై ఈ విధంగానే దాడులు చేసి ఆయా దేశాలను భయ భ్రాంతులకు గురి చేశారని గుర్తు చేశారు. ప్రపంచమంతా అమెరికా యుద్ధోన్మాదాన్ని ఖండిస్తున్నా, పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తుందన్నారు. యుద్ధం వలన ఆయిల్ రేట్లు పెరిగి దాని ప్రభావం ప్రపంచమంతా ఉంటుందని, అందువలన అమెరికా ఈ చర్యలు మానుకోవాలని ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని ఆపాలని అన్నారు. అమెరికా చర్యలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వత్తాసు పలకడం భారత దేశానికి నష్టమన్నారు. దేశ ప్రజలు దీన్ని పెద్దఎత్తున ఖండించాలన్నారు. అమెరికా వైఖరి పట్ల ఇదే తీరు కొనసాగితే సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి.కొండయ్య, సీఐటీయూ నాయకులు కె.శరత్, ఉప్పరపాలెం శాఖ పార్టీ కార్యదర్శి సుభాని, కమిటీ సభ్యులు రంగా రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతో చిరుద్యోగులను రోడ్డున పడేసిన కూటమి ప్రభుత్వం



యువత పోరుకు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్, పార్టీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్
- యువత పోరుకు రేపల్లె నుంచి భారీగా తరలివెళ్లిన పార్టీ శ్రేణులు

రేపల్లె: కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు చేసిన మోసాన్ని నిరసిస్తూ పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు జిల్లా కేంద్రమైన బాపట్లలో జరిగిన యువత పోరుకు రేపల్లె నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తరలివెళ్లిన ర్యాలీని గుళ్ళపల్లి పార్టీ కార్యాలయం వద్ద డాక్టర్ గణేష్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా కల్పిస్తామని, అప్పటి వరకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు అందిస్తామని బూటకపు హామీలిచ్చి కూటమి ఓట్లు దండుకుందన్నారు. అధికారం చేపట్టి సంవత్సరం గడిచినా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. నిరుద్యోగ భృతి విషయాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. రాజకీయ కక్షతో లక్షలాది మంది చిరుద్యోగులను విధుల నుంచి తప్పిస్తూ వారి కుటుంబాలను రోడ్డున పడేస్తుందన్నారు. రాజకీయ వేధింపులతో వలంటీర్లను, ఎండీయూ వాహన డ్రైవర్‌లు, ఆపరేటర్‌లను, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డు అసిస్టెంట్‌లు లక్షలాది మందిని తొలగించిందన్నారు. చదువుకునే పేదలను సైతం ప్రభుత్వం తీవ్రంగా మోసగించిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి పూర్తిగా మంగళం పాడిందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించటంతో పాటు నిరుద్యోగ భృతిని వెంటనే అందించాలని ఆయన డిమాండ్ చేశారు. యువత పోరుకు తరలివెళ్లిన వారిలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్‌లు కరేటి శేషగిరిరావు, మేడికొండ అనిల్, యార్లగడ్డ వెంకట రాంబాబు, ఇంకొలు రామకృష్ణ, దుండి వెంకట రామిరెడ్డి ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న సీనియర్ అసిస్టెంట్ హుస్సేన్

రేపల్లె: ప్రజలు తమ సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పరిష్కరించుకోవాలని ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ హుస్సేన్ అన్నారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అనంతరం మాట్లాడారు. వెల్లటూరు గ్రామానికి చెందిన బొమ్మిడి పద్మావతి కాలనీలో సైడ్ కాల్వలు నిర్మించాలని అర్జీ అందించిందన్నారు. నగరం మండలం అద్దంకివారిపాలెం గ్రామంలో తన వ్యవసాయ భూమిని ఆన్‌లైన్ చేయాలని రాయల అచ్చయ్య, నగరంకు చెందిన గాలి పూర్ణ చంద్రరావు తన భూమిని ఆన్‌లైన్ చేయాలని అర్జీలు చేసుకున్నారన్నారు. అలాగే కళ్ళిఫలంకు చెందిన బెల్లంకొండ లక్ష్మి అన్నపూర్ణ ఇసుకపల్లిలోని తన భూములను ఆన్‌లైన్ చేయాలని, నల్లూరులోని సనాతన వేదాంత నిష్కాశ్రమ భూములకు పట్టాదారు పాసు పుస్తకం కోసం ఆశ్రమం తరపున పుట్టగుంట ప్రేమ్‌కుమార్ అర్జీలు అందించారన్నారు. భూమిని సర్వే చేయాలని కోరుతూ పేటేరుకు చెందిన గుమ్మడి కోటేశ్వరరావు అర్జీ అందించారని చెప్పారు. తాలూకా ఎదుట ఉన్న పోస్టాఫీసును పునఃప్రారంభించాలని పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సి.వి.మోహనరావు అర్జీ చేశారన్నారు. గంగడిపాలెంలో తనకు చేపల చెరువు కలదని, మత్స్యకార భరోసా నిధులు మంజూరు చేయాలని ఆ గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు అర్జీ అందించారన్నారు. త్రీఫేస్ విద్యుత్ లైన్‌కై పట్టణంలోని 3వ వార్డుకు చెందిన ఎం.సునీత, ఆర్ అండ్ బీ రహదారి ఆక్రమణలను తొలగించాలని పేటేరు గ్రామానికి చెందిన ఉరిమి శ్రీనివాసరావు అర్జీలు ఇచ్చారన్నారు. ఆయా సమస్యలు సంబంధిత శాఖల అధికారుల ద్వారా పరిష్కరించబడునన్నారు.

26న సర్వసభ్య సమావేశం

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): పిట్టలవానిపాలెం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 26న మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు అధ్యక్షతన జరగనున్నదని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎ.ఎలీషాబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని ఆయన చెప్పారు.

ఉపాధి హామీ జాబ్ కార్డులు మంజూరు చేయాలి

గాంధీనగర్ వాసుల వినతి



కొల్లూరు : ఉపాధి హామీ పథకం పనులు చేసుకోవడానికి అవసరమైన జాబ్ కార్డులు మంజూరు చేయకపోవడంతో పనులకు హాజరవ్వలేని పరిస్థితి నెలకొందని పలు కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొల్లూరు శివారు గాంధీనగర్‌కు చెందిన పలు కుటుంబాల వ్యక్తులు తమకు జాబ్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీడీవో కె.నరసింహారావు, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఉపాధి హామీ పథకంలో పనులు చేసే అవకాశం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అగత్యం ఏర్పడిందని తక్షణం జాబ్ కార్డులు మంజూరు చేయించాలని కోరారు. ప్రభుత్వ పథకంలో పక్కా గృహాలు నిర్మించుకోవడానికి సైతం జాబ్ కార్డులు అడుగుతున్న నేపథ్యంలో తమకు కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకుడు బి.సుబ్బారావు పాల్గొన్నారు.

తెనాలిలో ప్రజాసంఘాల ధర్నా

- సంధ్యారాణి బలవన్మరణ కేసు విషయమై...
- అత్తింటివారిపై 304(బి) కింద కేసు నమోదుకు డిమాండ్
- కొల్లిపర ఎస్ఐపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలి
- సబ్‌కలెక్టర్ సంజనా సింహాకు వినతి



ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు



సంధ్యారాణి (ఫైల్)

తెనాలి: కొల్లిపర మండల గ్రామం వల్లభాపురంలో చప్పిడి సంధ్యారాణి ఆత్మహత్యకు కారకులైన భర్త, అత్తమామలు, చిన్న మామపై ఐపీసీ సెక్షన్ 304(బీ) కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్‌తో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. కులనిర్మూలన పోరాట సమితి, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో సంధ్యారాణిని భర్త సంతోష్ కుమార్, అత్తమామలు కుమారి, వసంతరావు, చిన్న మామ కొండలు వరకట్న వేధింపులకు గురిచేసి, ఆమె ఆత్మహత్యకు పాల్పడేలా చేశారని ఆరోపించారు. మృతురాలి బంధువుల ఆందోళన తర్వాతనే 306 సెక్షన్ కేసు నమోదు చేశారని, అందులో చిన్న మామ పేరు చేర్చలేదన్నారు. ధర్నా చేయబోతున్నట్టు తెలిసి నిందితులను అరెస్టు చేశారని ఆరోపించారు. సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహాకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఆయా సంఘాల నేతలు, సంధ్యారాణి తల్లిదండ్రులు మీడియాతో చెప్పిన వివరాలిలా ఉన్నాయి. సంధ్యారాణి స్వగ్రామం పల్నాడు జిల్లా నకిరికల్లు మండలం కండ్లకుంట. తల్లిదండ్రులు పెరుగు ధనలక్ష్మి–ప్రసాద్. రెక్కల కష్టంతో ఇద్దరు బిడ్డలను చదివిస్తున్నారు. వల్లభాపురానికి చెందిన చప్పిడి వసంతరావు–కుమారిల ఏకైక కుమారుడు సంతోష్ కుమార్‌కిచ్చి 2019లో పెళ్లి చేశారు. రూ.3 లక్షల నగదు, 75 సెంట్ల భూమిని కట్నంగా ఇచ్చారు. పెళ్లయిన తర్వాత అదనపు కట్నం కోసం సంధ్యారాణిని శారీరకంగా, మానసికంగా హింసించటంతో, రెండు గ్రామాల పెద్దలు మాట్లాడి సర్దుబాటు చేశారు. కాపురం సజావుగా సాగింది. ఇద్దరు బిడ్డలు కలిగారు. అయినాసరే, అత్తింటివారి ధనదాహం తీరకపోవటంతో మళ్లీ సంధ్యారాణిపై వేధింపులు కొనసాగించారు. ఏప్రిల్ 23న రాత్రి సంధ్యారాణిపై దాడి చేసి తీవ్రంగా హింసించారు. ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి తీసుకెళ్లమని హెచ్చరించారు. మరుసటిరోజు వల్లభాపురం వెళ్లిన ప్రసాద్, ధనలక్ష్మి దంపతులు మరోసారి పెద్దల సమక్షంలో సర్దిచెప్పి వెనుదిరిగారు. ఆ వెంటనే సంతోష్‌కుమార్ కొట్టటంతో మనస్తాపం చెందిన సంధ్యారాణి, ఒంటిపై డీజిల్ పోసుకుని తగులబెట్టుకుంది. ఇరుగుపొరుగు ఇచ్చిన సమాచారంతో పరుగున వచ్చిన తల్లిదండ్రులు, ఆసుపత్రికి తరలించారు. గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో 43 రోజులు మృత్యువుతో పోరాడిన సంధ్యారాణి ఈ నెల 5న మృతి చెందింది. మృతదేహాన్ని నాలుగురోజులు మార్చురీలోనే ఉంచి, కేసు లేకుండా చేస్తేనే అంత్యక్రియలు చేస్తామని, పిల్లలకు ఎంతో కొంత ఇస్తామంటూ బెదిరించారని ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. తల్లిదండ్రులు నిరాకరించటంతో 306 సెక్షన్‌పై కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఎఫ్ఐఆర్ కాపీ, శవపంచనామా రిపోర్టు, 161 రిపోర్టు ఏదీ ఇవ్వలేదని కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ చెప్పారు. నిందితులకు అనుకూలంగా వ్యవహరించిన కొల్లిపర ఎస్ఐపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో ప్రజాసంఘాల నాయకులు ఎస్.పోతురాజు, జక్కా బ్రహ్మయ్య, జంపాల దుర్గ, చలంచర్ల అంజి, అందే శ్యామ్, కంచర్ల శేష పాల్గొన్నారు.

మమ్మల్ని మోసం చేశారు



సంతోష్ కుమార్‌కు ఉద్యోగం ఉందంటే అమ్మాయి సుఖపడుతుందని డిగ్రీ చదువుతున్న పిల్లనిచ్చి పెళ్లిచేశాం. కట్నం ఇచ్చాం. పెళ్లయ్యాక చదువుకుని సంధ్యారాణి డిగ్రీ పూర్తిచేసింది. మేమిచ్చిన కట్నం తక్కువని, వేరే పెళ్లి చేస్తే ఎక్కువ డబ్బు వస్తుందని మా బిడ్డను హింసిస్తూ, దొంగతనం నేరారోపణ చేసి మా కుమార్తె బలవన్మరణానికి కారకులయ్యారు. నేరానికి తగిన కేసు నమోదుచేసి, నిందితులను అరెస్టు చేయాలి.

–పెరుగు ధనలక్ష్మి–ప్రసాద్

సమర్థంగా విధులు నిర్వర్తించాలి



ఆర్డర్ కాపీలను అందిస్తున్న ఎంఈవో

ప్రత్తిపాడు: విద్యార్థుల అభ్యున్నతికి, పాఠశాల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు సమర్థవంతంగా విధులను నిర్వర్తించాలని ఎంఈవో సీహెచ్ రమాదేవి అన్నారు. మండలంలోని కోయవారిపాలెం, తిమ్మాపురం పాఠశాలల్లో ఎంటీఎస్ టీచర్లులుగా పనిచేస్తున్న బి.సుజాత ఏటుకూరు క్లస్టర్‌కు, వి.సువర్ణరత్నకుమారి ఎడ్లపాడు క్లస్టర్‌కు బదిలీ అయ్యారు. వీరికి ఎంఈవో రిలీవింగ్ ఆర్డర్లు అందించారు. అదే విధంగా వారి స్థానంలో వేమూరు మండలం నుంచి ప్రత్తిపాడు క్లస్టర్‌కు పి.కల్యాణ లక్ష్మి, కొల్లూరు మండలం నుంచి చినకోండ్రుపాడు క్లస్టర్‌కు బి.సీతాదేవి బదిలీపై వచ్చారు. వీరు సోమవారం మండల విద్యావనరుల కార్యాలయంలో ఎంఈవో రమాదేవిని కలిసి జాయినింగ్ ఆర్డర్లు అందించారు. ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేస్తే సత్ఫలితాలు ఉంటాయని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో చేరాలంటూ ప్రచారం!



ప్రచార వాహనం వద్ద పద్మజారాణి, ఉపాధ్యాయులు, పిల్లలు

ప్రత్తిపాడు: మూసివేత దిశగా ఉన్న ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడు మెయిన్ ప్రాథమిక పాఠశాల మూతబడకుండా ఉండేందుకు కొందరు గ్రామస్తులు ప్రయత్నం చేస్తున్నారు. మూడు నెలలుగా ఇంటింటికీ తిరుగుతూ, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. గత విద్యా సంవత్సరం వరకు నలుగురైదుగురు ఉన్న ఈ పాఠశాలలో, ప్రస్తుతం ఇరవై మందికిపైగా విద్యార్థులను చేర్పించారు. ఇప్పుడు తాజాగా ప్రైవేటు పాఠశాలలకు తీసిపోకుండా, పిల్లలు పాఠశాలకు వచ్చేందుకు ఇబ్బంది పడకుండా ఉండేందుకు గ్రామానికి చెందిన గడ్డిపాటి పద్మజారాణి తన సొంత ఖర్చులతో విద్యార్థుల రాకపోకల నిమిత్తం స్కూలుకు వాహనాన్ని ఏర్పాటు చేశారు.

● రోజూ ఊరి చివరన ఉన్న ముస్లిం కాలనీ నుంచి పిల్లలను ఈ వాహనంలో బడికి తీసుకువచ్చి, తీసుకువెళుతున్నారు. పద్మజారాణితో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ పోతురాజు లక్ష్మీనారాయణ, గ్రామపెద్దలు బడి మూతపడకుండా మూడు మాసాలుగా తమ వంతుగా కృషి చేస్తున్నారు. రండీ.. మన ఊరిలో మన ప్రభుత్వ బడిలో మీ పిల్లలను చేర్పించండంటూ ఆటోల ద్వారా ప్రచారం చేయిస్తూ, కరపత్రాలు పంచుతూ నిత్యం క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు.

విధుల్లో ఉద్యోగుల అలసత్వం



సోమవారం ఉదయం 11.50 గంటలకూ తెరుచుకోని హౌసింగ్ కార్యాలయం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు హౌసింగ్ సిబ్బందిని అలసత్వపు జబ్బు పట్టిపీడిస్తోంది. కార్యాలయం ఎప్పు డు తెరిచి ఉంటుందో.. ఎప్పుడు మూసి ఉంటుందో.. తెలియని పరిస్థితి నెలకొంది. సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు పడుతు న్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. వీరి అలసత్వంపై ఆ శాఖ పీడీ సైతం హెచ్చరికలు జారీ చేసినా వారి తీరులో మాత్రం ఏమీ తేడా కనిపించడం లేదు. సోమవారం ఉదయం 11.50 గంటల వరకూ కార్యాలయం తలుపులు తెరుచుకోలేదు. తాపీగా, తీరిగ్గా మధ్యాహ్నం 12 గంటల తర్వాత సిబ్బంది కార్యాలయానికి వచ్చి తలుపులు తీశారు. ఇది ఈ ఒక్క రోజు పరిస్థితి కాదు. నిత్యం ఈ కార్యాలయం పనితీరు ఇదే తంతుగా మారింది. జిల్లా ఉన్నతాధికారులు స్పందిస్తే కానీ సిబ్బంది తీరులో మార్పు కనిపించేలా లేదని ప్రజలు వాపోతున్నారు.

రోడ్ల గుంతలు పూడ్చండి



తెనాలిఅర్బన్: 34వ వార్డులోని పలు రోడ్లపై గుంతలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని పూడ్చి విధంగా చర్యలు తీసుకోవాలని ఆవార్డు ప్రజలు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. 32వ వార్డులోని పార్కు స్థలంలో జంగిల్ క్లియరెన్స్ చేయాలని, 28వ వార్డులో మంచినీటి కుళాయి కనెక్షన్ తొలగించాలని, 8వ వార్డు మహేష్ రెసిడెన్సీలో వాటర్ లీక్‌ను అరికట్టాలని పలువురు వినతి పత్రాలు ఇచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేనేజర్ విల్సన్ జయకర్, డీఈ ఆకుల శ్రీనివాసరావు, ఏసీపీ శివన్నారాయణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.